మహిళ మెడలో గొలుసు అపహరణ

సబ్బవరం: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఓ ప్రైవేటు గోల్డ్ లోన్ సంస్థ ప్రతినిధి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. సీఐ రంగనాథం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి సమీపంలోని గొలగాం గ్రామానికి చెందిన సూరిశెట్టి ధర్మరాజు సబ్బవరం మండల కేంద్రంలోని ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ మణప్పురం గోల్డ్ లోన్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ధర్మరాజు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థికంగా సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో డబ్బులు అడ్డదారిలో సంపాదించాలన్న ఆలోచన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 23న విశాఖ నుంచి అనకాపల్లి బొద్దపు గోపీసత్యనారాయణ, అమ్మాజీ దంపతులు కారులో వెళుతున్నారు. సబ్బవరం మండలం దేవీపురం వద్దకు వచ్చేసరికి కారులో డీజిల్ అయిపోవడంతో ఆగిపోయింది. అదే సమయంలో అటుగా బైక్‌పై వెళుతున్న ధర్మరాజును గోపి లిఫ్ట్ అడిగి పెట్రోల్ బంక్ వద్ద దించమని కోరాడు. ఆ సమయంలో కారులో ఉన్న అమ్మాజీ మెడలో బంగారు ఆ భరణాలను గమనించిన ధర్మరాజు గోపిని పెంట్రోల్ బంక్ వద్ద దించేందుకు అంగీకరించాడు. సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గోపిని దించి మళ్లీ వస్తానని చెప్పి ఆగిపోయిన కారు వద్దకు వచ్చాడు. కారు సీటులో కూర్చున్న గోపి భార్య అమ్మాజీ వద్దకు వెళ్లి డీజిల్ కోసం మీ వారు బాటిల్ ఇమ్మన్నారు అని చెప్పాడు. దీంతో ఆమె బాటిల్ కోసం ముందుకు వంగడంతో మెడలో ఉన్న 46.8 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుపోయాడు. దీంతో లబోదిబోమంటూ బాధితురాలు భర్తకు విషయం తెలిపింది. వెంటనే బాధితులు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు సీసీ పుటేజీలు, ఇతర ఆధారాలతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం తీవ్రంగా గాలించారు. శుక్రవారం ఉదయం నిందితుడ్ని సబ్బవరం మండలం అసకపల్లి వద్ద చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడు ధర్మరాజు నుంచి 46.8 గ్రాముల బంగారంతో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

2 నుంచి 'ఏపీ కి జగనే ఎందుకు కావాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: వచ్చే నెల 2 నుంచి చేపట్టనున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వినూత్న కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలన్నారు. సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పార్టీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శుక్రవారం ఈ కార్యక్రమంపై సమీక్షించారు. పల్లె నిద్ర చేసి సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని చెప్పారు. టీడీపీ హయంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకుతింటే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు నేరుగా మేలు చేసేందుకు వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చిందన్న మంచి ఆశయాలను ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో వార్డుల అధ్యక్షులు గంద్రెడ్డి మహాలక్ష్మినాయుడు, మెంటి మహేష్, ఆదిరెడ్డి మురళి, దాడి ఉమామహేష్, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొర్లె రామునాయుడు, ముఖ్య నాయకులు చిప్పల చందు, వినోద్, దాసరి సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు నక్కా కనకరాజు సంస్మరణ సభ

పెందుర్తి: పెందుర్తి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, కో ఆప్షన్ మెంబర్, దివంగత నక్కా కనకరాజు సంస్మరణ కార్యక్రమం శనివారం జరగనుంది. మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో ఉన్న కనకరాజు నివాసం వద్ద ఆ ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పర్యవేక్షించారు.

ఉపాధ్యాయురాలు శ్రీదేవి అంత్యక్రియలు పూర్తి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్


ఉపాధ్యాయురాలు శ్రీదేవి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన కేజీబీవీ ఉపాధ్యాయురాలు బొడ్డు శ్రీదేవి పార్థివ దేహానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరాపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతపూడి కేజీబీవీ ఉపాధ్యాయురాలు శ్రీదేవి మృతిచెందారు. అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భౌతిక కాయానికి స్వగ్రామం పెదనాయుడుపాలెంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో పాటు పలువురు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి భర్త నాగేశ్వరరావుతో పాటు పిల్లలను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, నాయకులు కొటాన రాము, సబ్బవరపు త్రినాథ రామకాసు, తదితరులు ఉన్నారు.

చీటీల పేరుతో టోకరా!

- 30 మంది నుంచి రూ.50 లక్షల వసూలు
- పరారీలో నిర్వాహకురాలు

పెందుర్తి: చీటీల పేరుతో ఓ మహిళ తమను మోసం చేసిందని బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 30 మందికి రూ.50 లక్షలకు పంగనామం పెట్టింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..పెందుర్తి అఖిలేశ్వరి ఆస్పత్రి సమీపంలో మెండ పార్వతి అనే మహిళ చాలాకాలంగా చీటీలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల చీటీల పేరుతో దాదాపు 30 మంది నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసింది. అయితే పాడుకున్న నగదు తన వద్ద ఉంచితే అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి ఆ నగదు తన వద్దే ఉంచుకునేది. అయితే వడ్డీ సక్రమంగా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి వారు పార్వతిని నిలదీశారు. దీంతో ఆర్నెల్ల కిందట ఆమె పెందుర్తి నుంచి పరారైంది. ఆమె ఆచూకీ కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు విద్యార్థులు


రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30 వరకు రాజమహేంద్రవరం, గుంటూరు, ఈస్టు గోదావరి జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు అండర్ 19, 17, 14 విభాగాల్లో 18 మంది సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు(ఉమ్మడి విశాఖ జిల్లా) ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ అభినందించారు. కోచ్‌గా ఎస్.రామ్మోహన్, మేనేజర్‌గా ఎం.మనీష్ వ్యవహరిస్తారని స్పోర్ట్ డైరెక్టర్ మధుబాబు చెప్పారు

ఈ- పంటల ముసాయిదా జాబితా పరిశీలన


ఈ- పంటల ముసాయిదా జాబితాను పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన అన్ని రకాల పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్టు ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు.దీనిలో భాగంగా సాగు వివరాలతో కూడిన రైతుల ముసాయిదా జాబితాలను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలు,గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు.ఈ జాబితాలను రైతులు పరిశీలించి అభ్యంతరాలు ఉంటే వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకూ జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. తుది జాబితాను మరలా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బండారు శ్రీను, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు హేమలత పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలు


మాట్లాడుతున్న అజేయ్‌రాజ్

పరవాడ: ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజేయ్‌రాజ్ పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో ఎమ్మెల్యే అతిథిగృహంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరమో కూలంకుషంగా వివరించారు. సమావేశంలో పార్టీ నాయకులు భగవాన్ జయరాం, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొన్నారు.

ఉద్యమంలా జగనన్న ఆరోగ్య సురక్ష


పురుషోత్తపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పేద, మధ్య తరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పురుషోత్తపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 350 మందికి వివిధ రకాల పరీక్షలు జరిపి మందులు అందించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు కోరాడ చందుయాదవ్, వైద్యాధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

పరవాడ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఉక్కునగరం పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో పరవాడ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అవినీతి వద్దు అనండి- దేశానికి అంకితం అవ్వండి అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలను సంస్థ చీఫ్ మేనేజర్ రాధా మనోహర్ ప్రారంభించారు. 8, 9, 10 తరగతులకు చెందిన 45 మంది విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచన పోటీల్లో కె.ఏకలవ్య (ప్రథమ), జి.పవన్ (ద్వితీయ), వి.మేఘన(తృతీయ), డి.విఘ్నేష్ (నాలుగో) స్థానాల్లో విజేతలుగా నిలిచారు. విజేతలకు సంస్థ చీఫ్ మేనేజర్ రాదా మనోహర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలనాయుడు, పవర్‌గ్రిడ్ సంస్థ ప్రతినిధులు పైల అప్పారావు, కె.శ్రీనుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సుయాత్రకు ఏర్పాట్లు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారబస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ యాత్రలో భాగంగా ఎండాడలోని వైఎసార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. బహిరంగ సభకు 30 వేల మంది వరకు హాజరుకానున్నట్టు అంచనా వేశారు. ప్రజల సౌకర్యార్థం 16 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

పాడి రైతులకు దసరా కానుక

పరవాడ: పాడి రైతులకు అమూల్ దసరా కానుకగా(బనాస్ మిల్క్ యూనియన్) 822 మంది పాడి రైతులకు రూ.17.48 లక్షలు బోనస్ మంజూరు చేసిందని ఎంపీడీవో హేమసుందర్రావు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆవు పాలపై లీటరుకు రూ.1.73 పైసలు, గేదె పాలపై లీటరుకు రూ.7.30 పైసలు ధరను పెంచుతూ ఆమూల్ జూన్‌లో నిర్ణయం తీసుకుందని చెప్పారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా గతేడాది మే 20న ప్రారంభించినట్లు తెలిపారు. తొలి దశలో 13 కేంద్రాల్లో ప్రారంభించిప పాల సేకరణ ద్వారా రోజుకు 3335 లీటర్ల పాలను రైతులు సరఫరా చేస్తున్నారన్నారు. పరవాడ-1 సంఘానికి చెందిన మహిళ పాడి రైతు హైమావతికి రూ.30,245 అదనపు ఆదాయం లభించిందని చెప్పారు.

యువకుడి అదృశ్యం



పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు కోట నరవకు చెందిన యువకుడు అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ దేముడు తెలిపిన వివరాలు.. కోట నరవలో దాడి సూరిబాబు కుటుంబం నివాసం ఉంటుంది. సూరిబాబు కుమారుడు గణేష్(28) కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన గణేష్ తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడి కుటుంబ సభ్యులు శుక్రవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

12 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

రూ. 95 వేలు స్వాధీనం

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెం కుమ్మరి కాలనీలో జరుగుతున్న పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.95 వేలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.